


# తపము ఫలించిన శుభవేళ...

– కె. కె. రఘునందన



''ఈసారి నా పట్టునుంచి నువ్వెలా తప్పించుకుంటావో నే చూస్తాను. ఏయ్ నిన్నే... ఇటురావాలి నీపని చెబుతాను. ఆ! అమ్మదొంగా దొరికావ్?! ప్రవీణా నిన్నూ...''

పరిగెత్తి పరిగెత్తి బాగా అలసిపోయాం. నా ఎద ఉత్తుంగ తరంగంలా ఎగిసి పడుతూంది.

ఆ పచ్చిక బయలుమీదనే ఇద్దరం వాలిపోయాం. వినీలాకాశంలో సొగసులు చూస్తూ సేదతీరసాగాను. పక్షులు కువకువలాడుతూ ఎగురుతున్నాయి. పారవశ్య సముద్రంలో ఈదులాడ్డం నావంతయింది.

''బావా! శాశ్వతంగా నీ కౌగిలిలో కరిగిపోవాలనుంది. నాకా అదృష్టం కల్పిస్తావా...'' తన్మయంగా అడిగాను.

''మనం ఒకరికోసం ఒకరం పుట్టాం. నిన్ను పొందటం జన్మజన్మల అదృష్టంగా భావిస్తున్నాను. నీవు తప్ప హృదయంలో ఇంకొకరికి స్థానంలేదు.'' అలా అన్నప్పుడు హృదయం సంతృప్తితో ప్రఫుల్లమైంది.

ఒకరికొకరం ప్రమాణాలు చేసుకున్నాం.

అలవిగాని ఆనందంతో గోపి నా కనుల్లోకి చూస్తుంటే నేనెన్నో అద్భుత విజయాలు సాధించినంతగా గర్వపడ్డాను.

ఇది గతంలోని ఓ మనోహర దృశ్యం. నా మనసు కాన్వాసుపై మరెన్నో రంగు రంగుల దృశ్యాలున్నాయి.

కాని అడ్డుగోడల్లాటి పెద్దలే మా ఇరువురి జీవితాలను విడదీయ సంకల్పించారేమోననిపిస్తూంది.

అసలెందుకీ ద్వంద్వ వైఖరి... పవిత్రమైన రెండు హృదయాల కలయికకు మహాభిషేక మొనర్చవలసిన వీళ్ళేనా వక్రబుద్ధులకు హారతి పడుతున్నారు? ఛీ!!

... ఒక్కసారి గతం పల్కరించింది.

• • •

అందమైన ఆ పల్లెలో పరువుగల కుటుంబం మాది. అమ్మనాన్నలకు లేక లేక కలిగానని ముద్దుగా పెంచారు నన్ను. అలా అని చెప్పి నేను మొండిగా తయారవలేదు. చదూసంధ్యల్లో, ఆటపాటల్లో నేనే ముందుండేదాన్ని. అందమైన నేనంటే అందరికీ ప్రీతే.

ప్రతి సెలవులకి కోనసీమలో ఉండే మామయ్యగారింటికి వెళ్ళేదాన్ని. శేషుమామయ్య, రాధత్తయ్యలకు నాపై అభిమానం కొట్టొచ్చినట్లుగా కనిపించేది.

వాళ్ళకి ఒక్కడే కొడుకు- గోపి.

గోపిబావ నేను జట్టుగా తిరిగేవాళ్ళం. బావ చాలా తెలివైనవాడు. స్ఫురద్రూపి.

ఒకసారి దసరా సెలవుల్లో శేషుమామయ్యగారింటికి వెళదామనుకున్నాను. సరిగ్గా అప్పుడే తుఫాన్ పట్టుకుంది. గోదావరి ఉప్పొంగి వరదలు వచ్చాయి. గోదావరి ఒడ్డునున్న సిరిపల్లె మామయ్యగారిది. రాత్రికి రాత్రి పల్లెలోకి నీరు ప్రవేశించిందిట. అందరినీ తక్షణం నివాసాలు ఖాళీ చేసి వెళ్ళిపోవలసిందిగా రక్షణ సిబ్బంది హెచ్చరించిందట. శేషుమామయ్యగారి కుటుంబం కట్టుబట్టలతో మా ఇంటికి వచ్చింది.

పదిరోజులు తాత్కాలికంగా తలదాచుకుని వెళ్ళిపోదామనుకున్న మామయ్యకు అశనిపాతంలాంటి సంఘటన ఎదురైంది. సిరిపల్లె మొత్తం జలదిగ్బంధనంలో చిక్కుకుపోయిందని తెలిసింది. తన ఆస్తి మొత్తం నామరూపాల్లేకుండా పోయినందుకు లబోదిబోమన్నాడు మామయ్య.

వాళ్ళని ఓదార్చి ఆశ్రయం కల్పించారు అమ్మ, నాన్న. తన తమ్ముడికి కొంత పొలం కేటాయించి, ఆధారం కల్పించమని కోరింది అమ్మ. ఒక తీవ్ర విఘాతంతో మా రెండు కుటుంబాలు అత్యంత సన్నిహితం అయినాయనే చెప్పాలి. గోపి బావను మా ఊర్లో జాయిన్ చేసారు. పదవతరగతిలో జిల్లాకే ప్రథమస్థానంలో నిలిచాడు. నాకు తెలియని వాటిని బావను అడిగితే చెప్పేవాడు. మా ఇరువురి కలసికట్టుతనం అందరినీ ఆకర్షించేది.

అది మొదలు నన్నెలాగయినా గోపిబావకు ఇచ్చి పెళ్ళిచేయాలని అమ్మనాన్నలు ఉవ్విళ్ళూరారు. మేం చేసిన మేలు మరచిపోని మామయ్య నన్ను కోడలిగా



చేసుకుంటానని సంతృప్తిగా అంగీకరించాడు.

అది మొదలు గోపిబావతో నా స్నేహం మరీ పెరిగింది. అయితే నేను వ్యక్తురాలినయినాక సిగ్గు, బిడియం అంటే ఏమిటో తెలిసొచ్చాయి. గోపి బావ పట్ల నాలో ఆశలు, కోరికలు మిక్కుటమైనాయి. అయితే బావ నాలో అనువు కనిపెట్టి మితిమీరలేదు.

ఇలా ఉండగా ఒకరోజు పోస్టులో రిజిస్టర్డ్ లెటర్ వచ్చింది. డిఫెన్స్‌లో బావ సైనికుడిగా సెలక్టు అయినట్లుగా సారాంశం. అసలెప్పుడు టెస్టుకి హాజరైనాడో... ఎపుడు రిటెన్ టెస్టుకి అటెండైనాడో మాకెవరికీ తెలీదు.

''మా డ్రిల్‌మేస్టారు.. నా బాడీ, అదీ చూసి నాచేత అప్లయ్ చేయించారు. ఫిజికల్‌గా ఫిట్ అయినాక రిటెన్ టెస్ట్ రాసాను. సెలక్టయ్యాను'' అని చెప్పి తల దించుకున్నాడు.

ఈ చిన్నవయస్సులో, చదువును అర్ధాంతంగా విడిచిపెట్టి డిఫెన్స్ సర్వీసులోకి వెళ్ళటం మాకెవరికీ ఇష్టం లేదు. ముఖ్యంగా నాకు.

''సైన్యంలో చేరటం గొప్పనుకున్నావు కాబోలు.. ఊపుతాపులకి తట్టుకోవాలి. రాష్ట్రాలు దాటి ఉద్యోగం అంటే మాటలు కాదు.'' అమ్మ, నాన్న వ్యతిరేకించారు.

కాని గోపిబావకు మాత్రం ఆర్మీలో చేరాలన్న ఉబలాటం, ఉత్సాహం మెండుగా ఉన్నాయన్న విషయం మేం వ్యతిరేకించగానే మారిన మొహంలోనే తెలిసింది.

''ఈరోజుల్లో ఉద్యోగాలు దొరకటం ఎంత కష్టమో మీరెరగనిదికాదు. కాళ్ళ దగ్గరకు వచ్చిన ఉద్యోగం కాలదన్నుకోవటం మంచిదికాదు. గోపి తప్పకుండా నిలదొక్కుకుంటాడు. నాకా నమ్మకం ఉంది'' అని డ్రిల్ మేస్టారు అందరినీ ఒప్పించారు.

గోపిబావ వెళ్ళటం ఖాయమని తెలిసిన నామది మిక్కిలి ఖేదపడ్డది. బావ వెళుతూ నన్ను ఒంటరిగా కలిసాడు. బావను పట్టుకుని విపరీతంగా ఏడ్చేసాను.

నన్ను తన గుండెలకు అదుముకుని- ''ప్రవీణా! నేనెంత దూరమైనా నీ ఉనికి ఎప్పుడూ నా గుండెలోనే.. నీ ప్రేమ చేసే సవ్వడి అనుక్షణం నాకు వినిపిస్తునే ఉంటుంది...'' అని చెప్పి అనునయించి, కనులపై ముద్దిడాడు.

అంతే మరి రెండు నెలల తరువాత గోపి నుండి ఉత్తరం. అదీ మామయ్యకి. మొదట సంవత్సరం ట్రైనింగ్, తరువాత పోస్టింగ్ ఇస్తారని రాసాడు.

ఐదునెలల తరువాత బావ సెలవుపై ప్రత్యక్షమైనాడు. గోపిని చూడగానే అందరికీ ప్రాణం లేచివచ్చినట్లయింది. నా ఉల్లాసానికి, ఉత్సాహానికి పట్టపగ్గాలు లేవు. గంతులేసే తువ్వాయినైనాను.

గోపిబావ ఒళ్ళుచేసి నిగనిగలాడే యాపిల్ పండులాగయినాడు. అందరికీ బట్టలు, చలికాలానికి స్వెట్టర్లు తెచ్చాడు. నాకేం తేలేదనుకుని అలిగాను. నన్ను వెతుక్కుంటూ గదిలోకి వచ్చాడు. నా కళ్ళు మూసి ఏం తెచ్చానో చెప్పమన్నాడు. ఏవేవో చెప్పాను. కళ్ళు తెరవమన్నాడు. అంతే నా కళ్ళముందర మిల్కీవైట్ సిల్క్

## వంట



''మా మమ్మీకి డ్యాన్స్, డ్రైవింగ్, కరాటే, జూడో అన్నీ వచ్చు''
గర్వంగా చెప్పాడు వంశీ.
''అయితే మీ నాన్నకి 'వంట' చేయడం బాగా వచ్చుండాలే'' అన్నాడు బాబు.

- చందూవంశీ (ప్రొద్దుటూరు)

## కూర

''ఇవాళ మీ ఇంట్లో బీరకాయల కూర కదూ''
పక్కింటావిడ గీతని అడిగింది సీత.
''అవునవును! అంత ఖచ్చితంగా ఎలా చెప్పారు?''
ఆశ్చర్యంగా అంది గీత.
''రాత్రి మా పెరట్లో బీరకాయలు ఏ దొంగవెధవో కోసుకుపోయాడులెండి'' అంటూ వెళ్ళిపోయింది సీత.

- సాలగ్రామ వెంకటగిరి (టంగటూరు)


## సీక్రెట్

''ఏమయ్యా.. నేను మెంటలోడినని చెబుతున్నావంట?'' మండిపడ్డాడు మేనేజర్.
''సారీ సర్! అది సీక్రెట్‌గా ఉంచాలన్న విషయం మరచిపోయాను!'' చెప్పాడు క్లర్క్ కామేష్.

## దర్శనం

''గుళ్ళో అమ్మవారి దర్శనం బాగా జరిగిందా వదినా?''
''దర్శనం బాగా జరిగింది వదినా. అమ్మవారికి కొత్త నగ చేయించారు. ఎంత బావుందనుకున్నావ్?''
చెప్పింది చంచలాక్షి.

- పి.వి.రమణకుమార్ (చిలకలూరిపేట)




నైటీ మెరిసింది. దాన్ని వేసుకుని వచ్చాకనే మాటలని పట్టుబట్టాడు.

ఆనైటీలోవున్న నన్ను చూస్తూనే అమాంతం బెడ్‌మీదకు తోసి గట్టిగా కౌగలించుకుని ముద్దుల వర్షంలో ముంచెత్తాడు.

ఎవరో అలికిడి అయితే మెల్లగా జారుకున్నాడు.

గోపిబావ వున్న ఆ నాలుగు రోజులు నాలుగు క్షణాల్లా గడిచాయి. అక్కడుంటున్నాడన్న మాటేగాని నా మీదనే తన ధ్యాసట...

బావ వెళ్ళిపోవటంతో ఈసారి మరీ విచారం వ్యాపించింది. రోజులు ఎప్పుడూ ఒక్కలాగ ఉండవు. విధి చేయు వింతలెన్నెన్నో ఉంటాయి.

సంవత్సరం గడిచింది. బావకు కాశ్మీరు పోస్టింగ్ ఇచ్చారు. ఆసరికే కాశ్మీరు పరిస్థితి ప్రమాదకరంగా పరిణమించింది. పాక్ సైనికులు నియంత్రణ రేఖను దాటి భారత భూభాగంలోకి దురాక్రమణ జరిపే దుష్కృత్యానికి శ్రీకారం చుట్టారు.

భారత భూభాగంలో కీలక స్థావరాలను చొరబాటుదార్లు ఆక్రమించుకున్నారు. చొరబాటుదార్ల నుండి విముక్తి కోసం ప్రతిక్షణం పోరాడవలసిన అత్యంత ఆవశ్యకత సాక్షాత్కరించింది.

చొరబాటుదార్లను తరిమి కొట్టేందుకు భారత సైన్యం, ఎముకలు కొరికే చలితోపాటు, చల్లటిగాలులు సైతం ఎదుర్కోవలసి వస్తుంది. పాక్ ప్రేరేపిత తీవ్రవాదులు, భారత సైనికుల మధ్య జరిగే భీకర సంగ్రామంలో ఎవరి ప్రాణాలు గాలిలో కలిసిపోతాయో అనూహ్యంగా పరిణమించింది.

అన్ని పేపర్లలో, టీవీలో ప్రసారమవుతున్న వార్తల సారాంశం విన్న ప్రతి ఒక్కరికీ ఒళ్ళు గగుర్పాటు కల్గిస్తోంది. గోపిబావ గురించి పిరికిదానిలా ఆలోచించసాగాను. అనుక్షణం నా గుండెలో శతఘ్నులు పేలుతున్నట్లే అనిపిస్తోంది. శేషు మామయ్య, రాధత్తయ్యల బెంగ అంతా యింతా కాదు. అమ్మ, నాన్నలు కూడా కళవళపడ్డారు. అదే రోజుల్లో మా ఇంటికి దూరపు బంధువు భాస్కరం అనే ఆయన వచ్చాడు.

ఒకరాత్రి భోజనాలు అయినాక వారి సంభాషణంతా నా చెవిన పడుతునే ఉన్నది.

''ఏమిటే? మీ అమ్మాయికి వాళ్ళ బావతో పెళ్ళి కుదిర్చేసారా? అంటే మిలట్రీలో ఉన్నాడని చెప్పారే అతడేనా?! అతడుండేది కాశ్మీరులో కదూ. చాలా బాగుంది. మీ అమ్మాయి మహా సుఖపడిపోతుందిలెండి. ఇంకానయం మెళ్ళో పుస్తె కట్టి ఉద్యోగంలోకి పోలేదు. అవతల కాశ్మీరు మీద పాక్ దాడులెంత తీవ్రంగా ఉన్నాయో తెలుసా. వందలాది సైనికులు మట్టి కరుస్తున్నారు. ఒకవేళ అతడు బతికే వున్నాడన్నా... ఏమిటి లాభం. దినదిన గండం నూరేళ్ళ ఆయుష్షు... అంతే మిలట్రీ బ్రతుకులు...'' అని ఒకటే రెచ్చిపోయాడు భాస్కరం.

ఆయనకి భారత సైనికులపట్ల ఎంత అవివేక, అనారోగ్యకరమైన భావాలున్నాయో తెలిసేసరికి నా రక్తం కుతకుత ఉడికింది. అతగాడు నాటిన విషబీజం మావాళ్ళపై పడింది. వాతావరణం వేడెక్కింది.

శేషు మామయ్యమీద వెర్రెత్తిపోయారు నాన్న.

''మొదటినుంచీ వద్దనే అంటున్నాను. కోరి నరకం తెచ్చిపెట్టుకున్నాడు. అసలు మనకళ్ళబడ్తాడో లేదో...''

''వాడి ప్రాణాలు ఎలా ఉన్నాయోనని మన ప్రాణాలు అల్లాడిపోతున్నామాయే...'' అని అమ్మ ఒకటే విసుర్లు.

శేషు మామయ్య రాధత్త చితికిపోయారు.

బావపై వ్యాఖ్యలు నేనసలు సహించలేకపోయాను. కనులంట అశ్రువర్షం.. దిండులో తలదాచుకున్నాను. దగ్గరగా వచ్చిన అమ్మ నన్ను ఓదార్చి... నా చేతుల్లో ఓ ఫోటోపెట్టింది.

''విక్రమ్.. అమెరికాలో ఇంజనీర్... బాగున్నాడు కదమ్మా. నీకు సరియైన జోడీ... నువ్వు 'ఊ' అంటే ముహూర్తాలు పెట్టిస్తాం'' అని నచ్చచెప్పడం ప్రారంభించింది.

గోపిబావతో నాకున్న అనుబంధం, వాళ్ళు చేసుకున్న ప్రమాణాలు... స్పుటంగా తెలిసినాసరే వేరే వాడితో పెళ్ళి ప్రయత్నాలు చేయటానికి మనస్సెలా ఒప్పిందో గింజుకున్నా అర్థంకాలేదు. ''బావంటే నీకు అంతులేని ప్రేమ ఉండచ్చు. కాదనం. ఎప్పుడైతే మిలట్రీలో చేరాడో అప్పుడే అతని జీవితం కత్తుల వంతెనపైకి పోయిందని గ్రహించాం. ప్రస్తుత పరిస్థితిలో బావ వచ్చే సూచనలు లేవు. అందువల్ల నీ జీవితం పూలబాటలో నడిపిద్దామని ప్రయత్నం. హాయిగా ఫారిన్ వెళితే ప్రశాంతంగా ఉంటుంది.'' అని నన్ను నామనస్సును మార్చాలని శతధా ప్రయత్నించారు నాన్న.

అంతే నాలో కట్టలు తెచ్చుకున్న ఉద్రేకం ఏర్పడింది. వారి ద్వంద్వ నీతిని దుమ్మెత్తిపోసాను. దేశ రక్షణ కోసం ప్రాణాలర్పించే ఉన్నత వ్యక్తిత్వంగల వాడిని హీనంగా చూడటాన్ని మించిన దౌర్భాగ్యం మరోటి లేదన్నాను. ఆరోజు నుండి ఎవరితో మాట-మంతి లేవు. తిండి తిప్పు మరిచాను.

ఇక్కడి విషయాలన్నీ వివరిస్తూ బావకో ఉత్తరం రాసాను. జవాబుకోసం నిరీక్షిస్తూ కాలం గడపసాగాను.

• • •

''పోస్టు'' అన్న కేకతో ఉలికిపడి ఈలోకంలోకి

వచ్చాను. గోపిబావ నుండి.

''ప్రవీణకు-

మీ బావ గోపి ప్రేమతో వ్రాస్తున్న లేఖ, క్షేమం నువ్వు క్షేమమని తలుస్తాను. దేశరక్షణనే నిర్దిష్ట ధ్యేయంతో ఒక్కో అడుగు ముందుకు వేస్తూ చొరబాటుదార్ల దాడులను అణచటానికి మొక్కవోని ధైర్యంతో కదులుతున్నాం. అప్పుడప్పుడు మన తీయని స్మృతులు కదలాడినంతనే జీవితంమీద ఆశ చిగురిస్తూంది. ప్రమాదభరితమైన పోరాటంలో కూడా నేను చిరునవ్వు చిందించగల్గుతున్నానంటే దాని క్కారణం నీతో అప్పుడప్పుడు పంచుకున్న అమృత సమమైన అనుభూతులే. అవే నాకు అత్యంత శక్తిని, మనోధైర్యాన్ని పంచిపెడుతున్నాయి. అయితే నాకోసం ఎదురుచూసి, ఎదురుచూసి నీ అందమైన యవ్వనాన్ని అడవిగాచిన వెన్నెల చేసుకోవటం నాకిష్టంలేదు. నా ఉద్యోగ బాధ్యతల దృష్ట్యా నీకు కలిగిస్తున్న అసౌకర్యానికి నేను చింతిస్తున్నాను. నీ అందానికి, అణకువకు తగిన వరుడు లభిస్తే మాత్రం పెళ్ళిచేసుకోవటానికి వెనుకాడకు. నేనే మనుకుంటానోనని ఆలోచించి పిచ్చిగా నిరీక్షించకు... దేశ రక్షణలో నా పాత్ర అత్యంత ప్రాధాన్యమైనది. సమయం లేనందువలన ముగిస్తున్నాను.

ఉత్తరం చదివినంతనే దిగులు నన్ను కొండచిలువలా చుట్టేసింది. పిచ్చిబావ నన్ను ఇదేనా అర్థం చేసుకున్నది? జీవితాంతం నీకోసమే నా ఎదురుచూపులు.

''ఎవరినుండి? బావ దగ్గరనుంచేనా!'' అని నా చేతిలో ఉత్తరం లాక్కున్న అమ్మ అది చదివి, నాన్నకు ఇచ్చింది. అంతే ఛర్రున లేచిపోయారు.

''కొంపదీసి.. బావ బాగా ఎడ్వాన్స్ అయిపోలేదు కదా. అయినా నాదమ్మా బుద్ధిపొరపాటు.. గోదారి ముంచిందని వీళ్ళని నా నెత్తికెక్కించుకున్నాను... నాకే ఎసరుపెట్టారు.''

''బావను తప్పుగా అంచనా వేయకండి. నా జీవితానికి మచ్చతెచ్చే మూర్ఖుడు కాదు..'' అని బావ నిజాయితి వివరించాను.

''అయినా గోపిలో తప్పులేదు. తన పరిస్థితి వివరిస్తూ, వేరే ఎవరినయినా పెళ్ళాడమనే చెప్పాడు'' అంది అమ్మ. శేషు మామయ్య, రాధత్తయ్యలు ఈ సంఘటనకు బాగా క్రుంగిపోయారు.

మరునాడు పేపర్లో- భారత సైన్యం ఒక్కో శత్రుస్థావరం గెలుచుకొస్తూ విజయపథంలో పయనిస్తుందని, ఆ సాధనలో అనేకులు వీరమరణం పొందుతూ, శత్రువుల పన్నాగాలను పారనివ్వటంలేదని... అన్నీ కళ్ళకు కట్టినట్లుగా వార్త వెలువడింది.

భయంకర వార్తలు వెలువడ్తున్న ప్రతిసారి గోపిబావ పని సరేనని ఊహిస్తున్నారు అమ్మ-నాన్నలు. నన్ను ఈవిధంగానయినా మారుద్దామని వారి విశ్వప్రయత్నం. అయినప్పటికీ వినలేదు నేను. నన్నో మొండిదానిగా జమ కట్టారు.

● ● ●

ఈపదిహేను రోజులు నేను కనిపించలేదని ఆందోళనపడినా నాకు అనవసరం.

ఎన్ని యుగాలయినా బావకోసమే నా నిరీక్షణ.

కార్గిల్‌పై భారత్ విజయం సాధించింది...

బావకు టెలిగ్రాం ఇచ్చి... నిరీక్షణలో గడుపుతున్నాను... నిద్రాహారాలు ఎలా ఉన్నాయో నాకే తెలీదు... వచ్చే రైలుకోసం... అందులో దిగే గోపిబావ కోసమే నా ఆత్రత.

ఎంత వద్దనుకున్నా వచ్చేది నిద్ర... ఆ నిద్రలోంచి తేరుకునేసరికి బాగా తెలవారిపోయింది... నిన్నరాత్రి నేను గమనించకుండా విడిచిపెట్టిన రైళ్ళలో కాని బావ?! ఆ ఊహే నన్ను కంగారుపెట్టింది.

కాని ఢిల్లీ నుండి ఏరైలు రాలేదని తెలిసింది. తృప్తిగా నిట్టూర్చాను. ఎనిమిది గంటలకు ఢిల్లీ నుండి రైలు వస్తున్న ప్రకటన వినిపించింది.

దిగే ప్రతీ మనిషినీ పరికిస్తున్నాను...

అంతే నా ఆనందానికి హద్దులులేవు...

నా సుదీర్ఘ నిరీక్షణ ఫలించింది...

గోపీబావ వస్తున్నాడు... ఎదురుగా వెళ్ళాను. అంతే బావ కనుల్లో కోటి జ్యోతులు.. సన్నటి నీటిపొర. మేమిద్దరం కలసి ముందుగా వెళ్ళింది ఇంటికికాదు.

● ● ●

మా ఇద్దరినీ చూసి తీవ్ర దిగ్భ్రాంతి చెందారంతా.

''అమ్మా ఏమిటిది?'' అరిచారు నాన్న.


''అనుబంధానికి తీపి గుర్తు పెళ్ళి... అదే జరిగింది. విదేశీయుడంటే మీకు మోజు. భారతీయుడైన గోపిబావ మీ దృష్టిలో ఓ గడ్డిపోచ! కాని ఆ గడ్డిపోచలే ఎన్నో కలసి దేశానికి బలంగా మారి పాక్ తీవ్రవాదాన్ని కట్టిపడేసాయి. ఆయుష్షు మూడడానికి భారతసైన్యంలోనే ఉండక్కర్లేదు. కుర్చీలో కూర్చున్నవాడికి గుండెపోటొచ్చినా చాలు... నేను బావలో మెచ్చింది, నచ్చింది... దేశానికి ప్రాణాలను సైతం అర్పించాలన్న అకుంఠిత దీక్ష. నా ఆలోచనల్లో.. ఊహలలో.. స్మృతులతోనే తను శక్తిమంతుడినైనట్లుగా నాకు చెప్పటమే బావపై మరింత ప్రేమను పెరిగేలా చేసింది. అందుకే నా జీవితం పంచుకున్నాను...'' అని నేను ఆనందాతిరేకంగా చెప్పుకుపోయాను.

శేషుమామయ్య, రాధత్తయ్యలు ఆనందానికి చిహ్నులుగా బాష్పాలు రాలుస్తుంటే-

పశ్చాత్తాపానికి ప్రతీకలుగా అమ్మ నాన్నల కంట్లోంచి కన్నీళ్ళు రాలుతున్నాయి.

★

## కోపం!



టైకో బ్రేహే డానిష్‌కు చెందిన ప్రముఖ ఖగోళ శాస్త్రజ్ఞుడు. ఆయన మహాముక్కోపి. నిత్యం ఎవరితోనో ఒకరితో తగువులాడుతూ ఉండేవాడు. ఓరోజున ఒక లెక్క విషయంలో తనదే సరైన లెక్క అని, సాటి శాస్త్రజ్ఞునితో గొడవపడ్డాడు. చివరికి ఆ ఇరువురూ ద్వంద్వ యుద్ధం చేశారు. ఆ యుద్ధంలో టైకో ముక్కు కాస్తా తెగిపోయింది. ఆటుపై తను బతికినంతకాలం మెటల్‌తో రూపొందించబడిన ఓ కృత్రిమ ముక్కుతో బతుకుబండి లాగించాడు.

## బతికున్న శవం!

హేమరాజ్ అనే 30 సం.రాల యువకుడు ఓ కంట్రాక్టర్ యొక్క తాతాసుమోను డ్రైవ్ చేస్తూ ఉంటాడు. ఒకరోజున జరిగిన ఓ పెద్ద యాక్సిడెంట్‌లో సుమో పూర్తిగా దెబ్బతింది. అందులో ఉన్న ఓ స్త్రీ మరణించింది. హేమరాజ్‌కు అతితీవ్రమైన గాయాలు తగిలి స్పృహ తప్పాడు. డ్యాక్టర్లు అతనికి కొంతసేపు వైద్యంచేసి, అతగాడు మరణించాడని చెప్పి, రాత్రి సమయంలో హేమ్‌రాజ్‌ను మార్చురీలో ఉంచారు. అతనికి తెల్లవారుఝామున స్పృహ వచ్చింది.

ముక్కులో దూది కుక్కివుంది. దాన్ని వూడబెరికాడు. తన ప్రక్కన పడుకొని ఉన్నవారిని లేపాడు. ఎవ్వరూ లేవలేదు. వారు శాశ్వతంగా కళ్ళు మూసుకుని వున్నారుకాబట్టి. చివరికి అతను తలుపులను అతి గట్టిగా బాదాడు. వాచ్‌మేన్ తలుపుతీశాడు. హేమరాజ్ తమ్ముడికి ఫోన్ చేశారు. హేమరాజ్‌ను ఎముకల డ్యాక్టర్ వద్దకు తీసుకువెళ్లారు. ఆనక హేమరాజ్ ఇంటికి ఆనందంగా వెళ్లాడు.

- కొడిమెల

